# అమ్మా వసుమతీ కన్నతల్లీ...

అమ్మా వసుంధరా, నువ్వేనమ్మా మా కన్న తల్లివి. అడక్కుండానే అన్నీ పెట్టే కల్పవల్లివి. నువ్వు లేనిదే మేము లేము. నువ్వు లేనిదే మాకు తిండి లేదు. కండ లేదు. బతుకు లేదు.

అమెరికాలోనూ నువ్వేనమ్మా. అనకాపల్లిలోనూ నువ్వేనమ్మా. చైనాలోనూ నువ్వేనమ్మా. దక్షిణాఫ్రికాలోనూ నువ్వేనమ్మా. మా మానవుల్నీ ఇంకా ఎన్నో ప్రాణుల్నీ అక్కున చేర్చుకుని, సేదతీర్చే చల్లని తల్లిని నువ్వేనమ్మా.



నువ్వు సర్వాంతర్యామివే కాదు, బహురూపివి కూడానమ్మా. చల్లగాలికి పచ్చపచ్చగా పరవశించే సస్యశ్యామల సీమవు నీవే తల్లీ. సూర్య కిరణాల సోయగాలతో ఎర్రెర్రగా మెరిసి మురిసేదానవు నీవేనమ్మా. తేమల్లో నిగనిగలాడే నవయువతివి నీవేనమ్మా. లేమితో పగుళ్లతో నకనకలాడే ముదితవు నీవేనమ్మా.

నీ గురించి ఎందరెందరో ఎన్నెన్ని భాషల్లోనో ఎంతగానో పొగిడారు. తల్లీ, సహనానికి మారు పేరు నువ్వేనన్నారమ్మా. ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అంటూ ఓ తెలుగు కవి గర్వపడ్డారమ్మా. మబ్బులో ఏముందిరా, మట్టిలో ఎంతో వుందిరా అని మెచ్చుకున్నాడమ్మా మరోకవి. ధరణికి గిరి భారమా, గిరికి తరువు భారమా... కనిపెంచే తల్లికి పిల్ల భారమా అన్నారింకొకరు. జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ అన్నారు మరొకరు.

మేం నిత్యం నిన్ను స్మరించుకుంటామమ్మా. నీ సువాసనతో తన్మయత్వం చెందుతామమ్మా. నువ్వెప్పుడూ పచ్చపచ్చగా వుండాలని కోరుకుంటామమ్మా. అలా నవ్వకమ్మా. అందులో మా స్వార్థం కూడా ఉందనుకో.

నువ్వు పచ్చగా వుంటేనే కదమ్మా మేమూ పచ్చగా ఉంటాం. నువ్వు పగుళ్లు పడిన పెళుసు ముఖంతో ఒటే మేం బాధపడతాం. పంటలు లేక బాధ పడతాం. పస్తులుండీ బాధపడతాం. దిక్కుతోచక తల్లడిల్లుతాం.

కానీ తల్లీ, మాలో ఉన్నట్టే నీకూ తారతమ్యాలున్నాయి. ఒకోచోట పచ్చగా వుంటావు. ఇంకోచోట బీడుగా వుంటావు. కానీ తల్లీ, నువ్వు బీడుగా ఉన్నచోట కూడా పచ్చగా ఉండాలని డామ్‌లు కడుతున్నాం. బ్యారేజీలు కడుతున్నాం. అదిగో, మళ్లీ అలా నవ్వకమ్మా. మా స్వార్థం కోసమే ఆ పనులు చేస్తున్నామనుకో. మరేం చెయ్యమంటావు చెప్పుతల్లీ. మా అవసరాల కోసం ఏవోవో చెయ్యక తప్పడం లేదు.

నువ్వు మాకు ఇరుకవుతున్నకొద్దీ మేం ఆకాశ హర్మ్యాలు నిర్మించుకోక తప్పడం లేదు. నీమీద ఒత్తిడి తేక తప్పడం లేదు. నీ మీద భారం మోపక తప్పడం లేదు.

అమ్మా నువ్వూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నావా! పైకి ప్రశాంతంగా కనిపిస్తూ లోలోపల పెనుభారం తోనో, మరింకే బాధతోనో గిలగిల్లాడుతున్నావా!

ఏమో తల్లీ, నిస్సంతగానో శోధించి, సాధించామనుకుంటున్న మా శాస్త్రజ్ఞులకే ఏమీ అంతుపట్టడం లేదమ్మా. మహారాష్ట్రలోనూ, మరికొన్ని ప్రాంతాల్లోనూ నీ గుండె పగిలింది. అగ్ని రగిలింది. అక్కడి వేలాది మంది గుండెలూ పగిలాయి. నిర్జీవులయ్యారు. నీవు లేనిదే మేము లేము కదమ్మా.

ఎంత ఘోరం జరిగిపోయిందని హృదయాలు ద్రవించి కన్నీళ్ళు పెట్టుకున్నామమ్మా. నీలో నీవు ఎంతగా కంపించి పోయేవో తల్లీ. అంతకు ముందు ఇంకెంత కుమిలి పోయేవో తల్లీ. నీ ఒళ్లంతా తూట్లు తూట్లే కదామా. నిర్జీవులయిన వాళ్ల ఒళ్లూ తూట్లు తూట్లేనమ్మా నీతోటే కదా మేమూ తల్లీ.

నీ ఒంటినిండా గాయాలే. బతికి బట్టకట్టిన వాళ్ల ఒంటినిండా గాయాలే. నీ గాయాలు ఎలా మాన్పాలో మా శాస్త్రజ్ఞులే ఆలోచించగలరమ్మా. గాయపడిన, పోయిన ఆప్తుల శోకంతో మనసు గాయపడిన వాళ్లకు తోటి వాళ్లం మేమే సాయపడాలమ్మా. నీ బిడ్డలం కదా తల్లీ.

11.10.93
ఆంధ్రభూమి దినపత్రిక